అందరూ నీలెక్క దందాలు చేయరు

- బ్లాక్‌మెయిల్, సెటిల్మెంట్లు చేసి బతుకుతరనుకోవడం పొరపాటు
- సీఎం రేవంత్ వ్యాఖ్యలు బ్యూరోక్రాట్ వ్యవస్థను కించపరిచేలా ఉన్నయ్ : హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : 'పచ్చకామెర్లోనికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుందన్నట్టు.. ప్రజాస్వామ్యానికి వెన్నెముక అయిన బ్యూరోక్రాట్ వ్యవస్థను కించపరిచేలా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం తగదని మాజీ మంత్రి హరీశ్‌రావు హితవుపలికారు. 'మీరు నగదు బ్యాగులతో దొరికారని, అందరూ మీ లానే బ్లాక్‌మెయిల్ దందాలు చేస్తారని, సెటిల్‌మెంట్లు, దందాలు చేస్తూ బతుకుతున్నారని అనుకోవడం తప్పు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు మన దేశ ప్రజాస్వామ్యానికి వెన్నెముకలు. సివిల్ సర్వెంట్స్ మోటో 'ఎక్స్‌లెన్స్ ఇన్ యాక్షన్'. 'ఏసీ ఇన్ యాక్షన్' కాదు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల గురించి తెలంగాణ సీఎం చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవమానించేవిగా, అగౌరవపరిచేవిగా ఉన్నాయి. బ్యూరోక్రాట్ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్న' అని మంగళవారం ఎక్స్‌వేదికగా పేర్కొన్నారు.

కేసీఆర్ చరిత్ర సృష్టించి సరిగ్గా 11 ఏండ్లు

తెలంగాణ రాష్ట్ర సాధన మహోద్యమంలో బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చరిత్ర సృష్టించి సరిగ్గా 11 సంవత్సరాలు పూర్తయ్యాయని హరీశ్ గుర్తుచేశారు. 'విజనరీ లీడర్ కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ సాధన ఉద్యమంలో కీలక ఘట్టం 2014 ఫిబ్రవరి 18న సాధ్యమైంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. నాటి ప్రజా ఉద్యమం విజయవంతమైంది' అని పేర్కొన్నారు. కేసీఆర్‌తోపాటు తాను రెండు చేతులతో విజయసంకేతం చూపుతున్న చిత్రాన్ని లఎక్స్‌లో పోస్టు చేశారు.

చెలిమె నీరే చేనుకు ఆధారం

రైతన్నకు మొదలైన సాగు కష్టాలు

ఆకేరువాగులో నీటి లభ్యత లేక అరిగోస

నర్సింహులపేట, ఫిబ్రవరి 18: మహబూబాబాద్ జిల్లా నర్సింహుల పేట మండల పరిధి ఆకేరువాగులో నీటి లభ్యత లేక అన్నదాతలు అరిగోస పడుతున్నారు. యాసంగి వరి పంటకు నీరు అందించేందుకు తిప్పలు పడుతున్నారు. వానకాలంలో కురిసిన భారీ వర్షాలకు జయపురం, ముంగిముడుగు గ్రామాల్లోని ఆకేరువాగుపై ఉన్న చెక్‌డ్యాంలు తెగిపోవడంతో వాగుల్లోనీరు నిలిచే అవకాశం లేకుండాపోయింది. దీంతో కొందరు చెలిమె నీటితో ఉన్న కొద్దిపాటి పొలాన్ని తడుపుకుంటున్నారు.

పత్తి రైతు విలవిల

- ప్రభుత్వాల నిర్లక్ష్యంతో నష్టం
- 10రోజులుగా నిలిచిన పత్తి కొనుగోళ్లు
- ఆధార్ సర్వర్ సమస్య అంటూ చేతులేత్తేసిన సీసీఐ
- రంగంలోకి దళారులు
- తెగనమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్న రైతులు

పక్క ఫొటోలోని రైతు పేరు చెవుల మల్లయ్య. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం గడ్డివానిపల్లి గ్రామం. రెండెకరాల్లో పండిన 18 క్వింటాళ్ల పత్తి 10 రోజుల క్రితం జమ్మికుంటలోని సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాడు. పత్తి బాగుందని చెప్పిన సీసీఐ అధికారులు ఆధార్‌లో సాంకేతిక సమస్య వచ్చిందని, ఇప్పుడు కొనుగోలు చేయడం సాధ్యపడదంటూ తేల్చిచెప్పారు. దీంతో 10 రోజులుగా పత్తి బస్తాలతో సీసీఐ కేంద్రంలోనే పడిగావులు పడుతున్నాడు. ఒక దశలో ప్రైవేట్‌కు అమ్ముదామని ప్రయత్నిస్తే రూ.5,600కు మాత్రమే అడగడంతో వద్దనుకున్నాడు. నిత్యం సీసీఐ, మార్కెట్ అధికారుల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నాడు. అధికారుల పిలుపు కోసం వేచి చూస్తూ ఆ రైతు పడుతున్న అవస్థ వర్ణనాతీతం.

కరీంనగర్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ఆదిలాబాద్/జమ్మికుంట: పాలకుల నిర్లక్ష్యం పత్తి రైతుల పాలిట శాపంగా మారింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కి విక్రయించి మద్దతు ధర పొందుదామనుకున్న పత్తిరైతుల ఆశలపై ప్రభుత్వాలే నీళ్లు చల్లుతున్నాయి. 10 రోజులుగా సీసీఐ కేంద్రాల వద్ద పత్తి కొనుగోళ్లు నిలిచిపోయినా పట్టింపులేకుండా పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఆధార్ సర్వర్‌లో సాంకేతిక సమస్యతోనే కొనుగోళ్లు చేయడం లేదని సీసీఐ, మార్కెటింగ్‌శాఖ అధికారులు చెప్తున్నారు. దానికి ప్రత్యామ్నాయంగా కొనుగోళ్లు చేపట్టే విషయంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడమే లేదు. దీంతో ఇప్పటికే సీసీఐ కేంద్రాల్లో లక్షలాది క్వింటాళ్ల పత్తి నిల్వలు ఉండగా, వేలాది మంది పడిగాపులు కాస్తున్నారు. ఈ సమస్య తెలిసి ఎందరో రైతులు ఇండ్లల్లోనే పత్తిని నిల్వ చేసి, సీసీఐ కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభమవుతాయోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇదే అదనుగా దళారులు జొరబడి తక్కువ ధరకే కొంటూ అందిన కాడికి దోచుకుంటున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు తెగనమ్ముకొని నష్టపోతున్నారు. అంతా తెలిసినా రాష్ట్ర సర్కారు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంపై సర్వాత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

10 రోజులుగా కొనుగోళ్లు బంద్

సీసీఐ కొనుగోల కేంద్రాల్లో క్వింటా పత్తికి రూ.7,521 మద్దతు ధరతో ప్రకటించి కొనుగోళ్లు ప్రారంభించారు. నిబంధనలకు లోబడి సీసీఐ కేంద్రాల్లో అమ్మకానికి రైతులు లక్షలాది క్వింటాళ్ల తమ పత్తి దిగుబడులను తరలించారు. ఆధార్ సర్వర్ డౌన్ అయిందంటూ, రైతు వివరాలు అధార్‌తో అనుసంధానం కాలేదని పేర్కొంటూ, రాష్ట్రంలోని అన్ని సీసీఐ కేంద్రాల వద్ద గత 10 రోజులుగా కొనుగోళ్లను నిలిపివేశారు. దీంతో వేలాది మంది రైతులు కోనుగోలు కేంద్రాల్లోనే ఉండి పడిగాపులు పడుతున్నారు. ఇంకా వేలాది మంది తమ నిల్వలను మార్కెట్‌కు తెలేక.. ఇంట్లో ఉంచుకోలేక సీసీఐ ఎప్పుడు కొనుగోలు ప్రారంభిస్తుందా? అని ఆశతో ఎదురుచూస్తున్నారు.

పత్తి రైతుల గోడు పట్టించుకోని సర్కార్

ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పత్తిని కొనుగోలు చేసే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోడం లేదు. కేంద్రంతో మాట్లాడి అధార్ సర్వర్ సమస్యలు తీరేలా కనీసం చొరవ చూపడం లేదు. సీసీఐ, మార్కెటింగ్ అధికారులతో ఒక కమిటీ వేసి ఆ కమిటీ ద్వారా నిబంధనల ప్రకారం పత్తి కొనుగోలు చేసి, సంబంధిత రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సేకరించిన పత్తిని అక్కడే కేంద్రాల వద్ద నిల్వచేసి.. సర్వర్ సమస్య తీరిన తర్వాత వివరాలు నమోదు చేసుకునే వెసులుబాటును కేంద్రం నుంచి పొందడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం ఉంటుందని అంటున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపినం

సీసీఐ ప్రస్తుతం కొనుగోళ్లు నిలిపివేసిన మాట నిజమే. ఆధార్‌లో సాంకేతిక సమస్య వచ్చింది. రైతులకు ఓటీపీ వస్తేనే సీసీఐ కొనుగోళ్లు చేస్తుంది. అందుకే కొద్ది రోజులుగా కొంటలేదు. ఈ సమస్యపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినం. ఇదే సమస్య రాష్ట్రం మొత్తంలో ఉన్నది. . సమస్య పరిష్కారమైతే మళ్లీ సీసీఐ మద్దతు ధరతో పత్తి కొంటది.

- మల్లేశం, ప్రథమ శ్రేణి కార్యదర్శి, జమ్మికుంట మార్కెట్

ఆర్ఎస్ఆర్ పేరుతో రైతు భరోసా కట్

- 1850 మంది రైతులకు బంద్
- ఎకరం ఉన్నా పడని డబ్బులు

పాలకుర్తి, ఫిబ్రవరి 18: రైతుభరోసా కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ఇప్పటికే ఓ సీజన్ ఎగ్గొట్టిన కాంగ్రెస్ సర్కారు.. ప్రస్తుతం రీసర్వే సెటిల్‌మెంట్ రిజిస్టర్(ఆర్ఎస్ఆర్) పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నది. జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని అర ఎకరం, ఎకరం రైతులకు రైతుభరోసా రాలేదు. మండల వ్యాప్తంగా 2వేల ఎకరాల వ్యవసాయ భూమి కాంగ్రెస్ సర్కారు బ్లాక్ లిస్టులో పెట్టింది. దీంతో మండలవ్యాప్తంగా 1850 మంది రైతులకు రైతు భరోసా ఆగింది. రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేసినా ఫలితం లేకుండాపోయింది. ఆర్ఎస్ఆర్‌లో గుంట, అర ఎకరం, ఎకరం పెరిగినా ఆ సర్వే నంబర్‌లో ఎంతమంది రైతులు ఉన్నా వారందరికీ రైతు భరోసా కట్ చేస్తున్నారు..

ఎకరంన్నర ఉన్నా రైతుబంధు రాలే

నాకు ఎకరంనర వ్యవసాయ భూమి ఉంది. అందులో పత్తి వేశాను. గతేడాది రైతుబంధు పడలేదు. ఈ సీజన్‌లోనూ వేయలే. ఎకరం, రెండెకరాల లోపు ఉన్న వారికి రైతు బంధు పడిందని అంటున్నరు. నాకు మాత్రం రాలేదు.

- జలగం ఇందిరమ్మ, రైతు, దర్దేపల్లి, పాలకుర్తి

ఆదిలాబాద్ ఎస్‌బీఐలో ఆందోళన చేస్తున్న రైతులు

బ్యాంకులో రైతుల ఆందోళన

- పంట అమ్మిన డబ్బులు ఇవ్వాలని ఆందోళన
- ఆదిలాబాద్‌లో రైతుల ఆగ్రహం

ఆదిలాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : పంట అమ్మిన డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐలో బైఠాయించి నిరసన తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడకు చెందిన నక్కల జగదీశ్, అంకోలికి చెందిన నల్లా వికాస్, భీంపూర్ మండలం వడూర్‌కు చెందిన జిల్లెల్ల మోహన్ నిరుడు సీసీఐకి పత్తి విక్రయించారు. జగదీశ్‌కు రూ.2 లక్షలు, వికాస్‌కు రూ.76 వేలు, మోహన్‌కు రూ. లక్ష రావాలి. ఆదిలాబాద్ ప్రధాన పోస్టాఫీసులోని వీరి ఖాతాల్లో పైసలు జమ అయ్యాయి. పోస్టల్ సిబ్బంది డబ్బులను సొంతానికి వాడుకోవడంతో రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం బ్యాంకు సిబ్బంది రైతుల డబ్బులను బ్యాంకుల్లోని వారి ఖాతాల్లో జమ చేశారు.

ఏడాదిగా బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు పోస్టాఫీసు నుంచి తమ బ్యాంకు ఖాతాల్లో జమైన డబ్బుల కోసం తిరుగుతున్నట్టు బాధిత రైతులు తెలిపారు. డబ్బులు ఇవ్వాలంటూ బ్యాంకు అధికారులను కోరినా ఫలితం లేదని వాపోయారు. సైబర్ పోలీసుల సూచన మేరకు 'మీ డబ్బులు బ్యాంకులో ఫ్రీజ్ అయ్యాయని' బ్యాంకు అధికారులు సూచించినట్టు రైతులు తెలిపారు. డబ్బులు విడుదల చేసినట్టు సంబంధిత పత్రాలు చూపించినా బ్యాంకు అధికారులు స్పందించడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు అధికారుల వైఖరిని నిరసిస్తూ బ్యాంకులోనే బైఠాయించారు. సైబర్ కేసు కారణంగా రైతుల ఖాతాలను హోల్డ్‌లో పెట్టారని, ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని బ్యాంకు అధికారులు తెలిపారు.

- కాంగ్రెస్ పాలనలో రైతులది రామగోస

ధర్పల్లి, ఫిబ్రవరి 18: కాంగ్రెస్ పాలనలోరామగోస మాత్రమే మిగిలిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుభరోసా రాలేదని, రుణమాఫీ కాలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం స్వల్పబండ తండాలో రైతులు మంగళవారం నిరసన చేపట్టారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులందరికీ రుణమాఫీ, రైతుభరోసా ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.

పసుపు రైతుల కన్నెర్ర

- నిజామాబాద్ మార్కెట్ ముట్టడి
- వారమైనా పసుపు కొనకపోవడంపై ఆగ్రహం
- గిట్టుబాటు ధర రావడం లేదని మండిపాటు
- వ్యాపారులు, అధికారులు కుమ్మక్కయ్యాయని ఆరోపణ

నిజామాబాద్ మార్కెట్ యార్డు సెక్రటరీ అపర్ణను చుట్టుముట్టిన రైతులు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 18: పసుపు ధర తగ్గించడంతో పాటు కొనుగోళ్లలో అనేక కొర్రీలు పెడుతుండడంతో కడుపుమండిన రైతులు మంగళవారం నిజామాబాద్ మార్కెట్‌యార్డును ముట్టడించారు. వ్యాపారులు, అధికారులు, మార్కెట్ పాలకవర్గం కుమ్మక్కై రైతులను నిండా ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పసుపు కొనుగోళ్ల సీజన్ ప్రారంభమై రెండు నెలలు దగ్గరకొస్తున్నా ఇప్పటి దాకా డైరెక్ట్ పర్చేసింగ్ సెంటర్ ఏర్పాటు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తున్నారని మండిపడ్డారు. మార్కెట్ యార్డుకు పసుపు తీసుకొచ్చి వారం రోజులు గడుస్తున్నా కొనడం లేదని వాపోయారు. మార్కెట్‌కు తీసుకొచ్చిన పసుపును వారం రోజులైనా ఎందుకు కొనడంలేదని ప్రశ్నించారు. మార్కెట్‌యార్డులో పలుకుతున్న ధర కన్నా దళారులు ఎక్కువ ధర చెల్లిస్తున్నారని రైతులు తెలిపారు. పసుపుబోర్డు వచ్చింది కదా.. మంచి ధర వస్తదని ఆశతో మార్కెట్‌యార్డుకు వస్తే నిరాశే మిగులుతున్నదని వాపోయారు. పసుపు బోర్డుతో రైతులకు ఎటువంటి లాభం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు మద్దతు ధర విషయమై పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డిని అడిగితే మార్కెట్ కమిటీ చైర్మన్‌తో మాట్లాడాలని, ఆయన దగ్గరకు వెళ్తే పసుపుబోర్డు చైర్మన్ వద్దకు వెళ్లాలని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మార్కెట్ కమిటీ సెక్రటరీ అపర్ణను మార్కెట్‌కు తెస్తున్న పసుపును ఎందుకు కొనడం లేదని నిలదీశారు.

పసుపు తెచ్చి వారమైంది

పసుపు ఉడికించి మంచిగా ఎండబెట్టి, పాలిష్ చేసి మార్కెట్‌కు తీసుకొచ్చిన. పోయిన మంగళవారం వారం మార్కెట్‌కు వస్తే ఇయ్యాళ దాకా కొనలేదు. గతంలో రెండ్రోజుల్లోనే కొనుగోళ్లు పూర్తయితుండే. ఈసారే అన్యాయం జేస్తుండ్రు. వ్యాపారులు ధర పెడుతలేరు.

- నరేశ్‌రెడ్డి, పడకల్, నిజామాబాద్ జిల్లా

ఖర్చులకు కూడా సరిపోవు..

తొమ్మిది నెలలు కష్టపడి పండించిన పంట మార్కెట్‌కు తెస్తే నాణ్యత లేదని వ్యాపారులు కొంటలేరు. మంచి పసుపు కొమ్ములకు కూడా రేటు పెడుతలేరు. . గిట్టుబాటు అయితదని ఈడిదాకా అత్తే ఏం లాభమున్నది. కనీసం ఖర్చులు కూడా అచ్చేట్టు లేవు.

- సాగర్‌రెడ్డి, రైతు, నిర్మల్ జిల్లా

కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం కొండపల్కలలో యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

సగం మందికే యూరియా

పొద్దంతా లైన్లలో నిల్చున్నా దొరకడం లేదని రైతుల ఆగ్రహం

మానకొండూర్ రూరల్/ తిమ్మాపూర్‌రూరల్, ఫిబ్రవరి 18 : యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సరిపడా నిల్వలు అందుబాటులో లేకపోవడంతో రైతులు అవస్థలు పడాల్సి వస్తున్నది. కరీంనగర్ జిల్లా మానకొండూర్, తిమ్మాపూర్ మండలాల్లో సింగిల్ విండో గోదాముల వద్ద గంటలకొద్దీ నిరీక్షిస్తున్నా సగం మందికి కూడా అందడంలేదు. మానకొండూర్ మండలం కొండపల్కలలోని సొసైటీ గోదాం వద్దకు సుమారు 300 మంది రైతులు మంగళవారం ఉదయమే చేరుకుని యూరియా కోసం లైన్‌లో నిల్చున్నారు. ఇందులో సగం మందికే అందడంతో మిగతా వారు నిరాశతో వెనుదిరిగారు. అసలే ఇప్పుడు పొలాలు కలుపు దశ పనులు నడుస్తుండగా.. యూరియా కోసం ఇలా పొద్దంతా లైన్లలో నిల్చున్నా దొరకడం లేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటు పొలం పనులు చేసుకోలేక, ఇటు యూరియా దొరకక అవస్థలు పడుతున్నారు.

కోతులను తరుమబోయి..

వ్యవసాయబావిలో పడి రైతు మృతి

నెక్కొండ, ఫిబ్రవరి 18: చేనులో పడిన కోతులను తరుమబోతున్న క్రమంలో ప్రమాదవశాత్తు వ్యవసాయబావిలో పడి రైతు మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లాలో చోటుచేసుకుంది. నెక్కొండ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం... నెక్కొండ మండలం మడిపెల్లి శివారు తేజావత్ తండాకు చెందిన తేజావత్ వెంకన్న (42) మంగళవారం మక్క చేనుకు కాపలాగా వెళ్లాడు. వెంకన్న భార్య సునీత కూడా కొద్ది దూరంలోనే కాపలాగా ఉంది. మధ్యాహ్నం చేనులోకి కోతులు రాగా వాటిని తరిమే క్రమంలో వెంకన్న ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడిపోయాడు. వెంటనే భార్య సునీత, గ్రామస్తులు వ్యవసాయబావి వద్దకు వెంకన్నను రక్షించేందుకు యత్నించగా అప్పటికే నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటుచేయాలి

- క్వింటాకు రూ.25 వేలు పెట్టి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- రైతు సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మం ఏఎంసీ ఎదుట ధర్నా

రఘునాథపాలెం, ఫిబ్రవరి 18: ఖమ్మంలో మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాల నాయకులు, రైతులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం అనుబంధ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ.. నాఫెడ్, మార్క్‌ఫెడ్ సంస్థల ద్వారా క్వింటాకు రూ.25 వేల చొప్పున ధర నిర్ణయించి కొనుగోలు చేయాలన్నారు. గత సీజన్‌లో క్వింటాకు రూ.25 వేలుగా ఉన్న ధర ఇప్పుడు రూ.12 వేలు కూడా పలికే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ అనుబంధ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆధ్వర్యంలో సంఘం నేతలు ఖమ్మం ఏఎంసీలో మిర్చి కొనుగోళ్లను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. దీంతో వీరిని పోలీసులు అడ్డుకున్నారు. ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి మిర్చి ధర పెంపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- సాగు నీరు లేక పంట ఎండినందుకు కౌలు రైతు
- దిగుబడులు రాక.. అప్పులు తీర్చే మార్గం లేక మరో రైతు
- ఖమ్మం, జనగామ జిల్లాల్లో ఇద్దరి బలవన్మరణం

ఇప్పటికి రాలిన మట్టిపూలు 430

బుచ్చయ్య (ఫైల్)

ఎల్లయ్య(ఫైల్)

మధిర(చింతకాని)/తరిగొప్పుల, ఫిబ్రవరి 18: సాగు నీరు లేక ఆశించిన మేర దిగుబడులు రాక.. సాగు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక తీవ్ర మనస్తాపంతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలు ఖమ్మం, జనగామ జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన నెరుసుల ఎల్లయ్య(45) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. దీనికి తోడు మూడెకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. యాసంగి వరి సాగు చేశాడు. పొట్ట దశకు చేరిన వరి పంటకు నీరందకపోవడంతో భూమి నెరెలుబారింది. సాగు భూమికి పక్కనే ఉన్న వాగులో కూడా నీరు లేకపోవడంతో పంట ఎండు దశకు చేరింది. ఇటు పంటను ఎలా కాపాడుకోలేక.. అటు పంట పెట్టుబడి కోసం తెచ్చిన రూ.2 లక్షల అప్పు, కౌలు డబ్బులు ఎలా కట్టాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో పురుగు మందు తెచ్చుకొని సాగు చేసిన పంట భూమి వద్దే తాగి అపస్మారక స్థితికి చేరాడు. కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించే ప్రయత్నం చేయగా.. అప్పటికే మృతిచెందినట్టు 108 సిబ్బంది నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

కౌలు రైతు నెరుసుల ఎల్లయ్య ఆత్మహత్య ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఎమ్మెల్సీ తాతా మధు విమర్శించారు. పంటకు నీళ్లు అందక ఎండిపోవడం, చేసిన అప్పులు తీర్చే పరిస్థితి లేక ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని అన్నారు. రైతుల మరణమృదంగం కొనసాగుతున్నా జిల్లాలోని ముగ్గురు మంత్రులకు పట్టదా? అని నిలదీశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సోలిపురంలో రైతు బుచ్చయ్య

జనగామ జిల్లా తరిగొప్పుల మండలం సోలిపురం గ్రామానికి చెందిన పాండ్యాల బుచ్చయ్య (51)కు రెండెకరాల 30 గుంటల భూమి ఉన్నది. ఇందులో ఎకరం 20 గుంటల్లో వరి, ఎకరంలో పత్తి సాగు చేశాడు. పంటలకు పెట్టుబడి నిమిత్తం రూ.14 లక్షల వరకు అప్పులయ్యాయి. గతేడాది నుంచి పంటల దిగుబడులు సరిగా రాలేదు. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తానికి గురై సోమవారం వ్యవసాయ బావి వద్ద గడ్డి మందు తాగి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో వారు బుచ్చయ్యను హుటాహుటిన జనగామ ఏరియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీదేవి తెలిపారు.